క్లుప్తంగా

ఆధార్ అప్‌డేట్ చేయించుకోండి

అంబాజీపేట: మండలంలో ఈ నెల 23 నుంచి 27 వరకు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల వద్ద ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. ఈ ఆధార్ అప్‌డేట్‌లో పేరులో మార్పులు, చిరునామా, ఫొటో, ఫోన్ నంబర్లను సరిచేసుకోవచ్చన్నారు. 23న పుల్లేటికుర్రు 1, 2, చిరతపూడి, తొండవరం, 24న కె.పెదపూడి, ఇసుకపూడి, వాకలగరువు, 25న పసుపల్లి, మాచవరం 1, 2, నందంపూడి, 26న ముక్కామల, వక్కలంక, మాచవరం 3, 4, గంగలకుర్రు అగ్రహారం, 27న ఇరుసుమండ, మొసలపల్లి, గంగలకుర్రు గ్రామాల్లో ఉన్న సచివాలయాల వద్ద ఆధార్ అప్‌డేట్‌ను నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

115 మందికి వైద్య సేవలు



బి.దొడ్డవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వర్ణలత

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం 104 ద్వారా ఉచిత వైద్య సేవలందించారు. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో సుమారు 115 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వర్షాకాలం సీజన్‌లో డయేరియాతో పాటు ఇతర వ్యాధులు కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉందని డాక్టర్ స్వర్ణలత పేర్కొన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం ఉమాభారతి, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, హెల్త్ అసిస్టెంట్ యజ్ఞేశ్వరరావు, పైలట్ జీవన్, డీఈఓ సత్యనారాయణ, ఆశ కార్యకర్త ఎస్‌వీ లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత పరీక్షలు



పసుపల్లిలో తాగునీటి పరీక్షలు చేస్తున్న సెంట్రల్ టీమ్ సభ్యులు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్షిత మంచినీరు అందించేందుకు నీటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుత వాతావరణంలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇందుకు సంబంధించి జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా సెంట్రల్ టీమ్ పర్యవేక్షణలో మంగళవారం పసుపల్లిలో నీటి పరీక్షలు నిర్వహించారు. టీమ్ కో ఆర్డినేటర్ డి.రాజేష్, సభ్యులు ఎం.లక్ష్మి, టి.సత్యవాణిల ఆధ్వర్యంలో నీటి నాణ్యత పరీక్షలను నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకు, కుళాయిలను పరిశీలించారు. అనంతరం ఇళ్లలో వాడుతున్న తాగునీటిని పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎల్.గణేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఆర్.ప్రసాద్, ఎస్.బలరామమూర్తి, ఏఎస్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలి

అంబాజీపేట: నిర్దేశించిన సమయంలో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. మాచవరంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను, నీటిని నిలువ చేసే ప్రాంతాల వద్ద నీటి నమూనాలను సర్పంచ్ శాంతకుమారి పర్యవేక్షణలో మంగళవారం సేకరించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ టీమ్ ప్రతినిధి భరత్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చలమయ్య, గోసంగి సత్యనారాయణ, కుసుమే విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అదిత్రి ప్రోగ్రాంపై అవగాహన సదస్సు



సఖినేటిపల్లిలంకలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నిర్వహించిన సదస్సు

సఖినేటిపల్లి: గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అమరావతికి చెందిన స్టేట్ ప్రైవేటు యూనివర్సిటీ ఎస్ఆర్ఎం ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ(సీఎస్ఆర్) కింద అదిత్రి ప్రోగ్రాంపై మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలో సఖినేటిపల్లిలంక, వీవీ మెరక గ్రామాల్లో ప్రాజెక్ట్ లీడ్ స్వాతి లేఖ, ప్రాజెక్ట్ మేనేజర్ రత్నకిషోర్ నేతృత్వంలో ఈ సదస్సులు జరిగాయి. మండల డీఆర్‌డీఏ ఏపీఎం విజయ్ సహకారంతో జరిగిన పై సదస్సుల్లో గ్రామీణ మహిళలకు వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం వంటి వాటిపై స్వాతి లేఖ, రత్నకిషోర్‌లు మాట్లాడారు. సర్పంచ్‌లు, డ్వాక్రా వీవోఏలు, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వయ్యారి భామ.. రైతుకు శ్రమ..



అంబాజీపేటలోని కొబ్బరి తోటలో ఉధృతంగా పెరిగిన వయ్యారిభామ మొక్కలు

- సమస్యాత్మక కలుపు మొక్క విస్తరణ
- పంటలకు సోకుతున్న చీడపీడలు

అంబాజీపేట: సమస్యాత్మక కలుపు మొక్కగా మారిన వయ్యారి భామ విస్తారంగా వ్యాపిస్తోంది. రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒక హానికరమైన కలుపుమొక్క అయిన దీనిని కాంగ్రెస్ గడ్డి, నక్షత్ర గడ్డి, మంగమ్మ చెట్టు అని పిలుస్తారు. దీనిని నివారించేందుకు ఢిల్లీలోని జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి, తిరుపతిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వయ్యారి భామను నిర్మూలిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కలుపు మొక్కను సామూహికంగా నిర్మూలించకపోతే రైతులకు తీరని నష్టం చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక్కో మొక్క 10 వేల నుంచి 50 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. వరి పంట పొలాలు, కొబ్బరి తోటలు, పూల తోటలు, రహదారి వెంబడి, జనవాసాల చుట్టూ, విస్తారంగా పెరుగుతోంది. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సాగు చేస్తున్న కొబ్బరి తోటలు, వరి పంట పొలాలు, కూరపాదుల్లోను వేల ఎకరాల్లో ఈ వయ్యారి భామ ఉధృతి అధికంగా ఉంది.

కలిగే నష్టాలు ఎన్నో...

పంట పొలాల్లో 40 శాతం, పశుగ్రాసం పంటలలో 90 శాతం దిగుబడిని ఈ వయ్యారి భామ తగ్గిస్తుంది. పార్థీనియం కొన్ని రకాల వైరస్‌లకు ఆశ్రయమిస్తూ వివిధ పంటల్లో వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందడానికి కారణమవుతుంది. మనుషుల్లో డెర్మటైటిస్, ఎగ్జిమా, తీవ్ర జ్వరం, ఉబ్బసం, బ్రాంకైటిస్, పుష్పాల పుప్పొడితో జలుబు, కళ్లు ఎర్రబడటం, కనురెప్పలు వాచడం మొదలైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. పశువులలో వెంటుకలు రాలిపోవడం, హైపర్‌టెన్షన్‌కు గురికావడం జరుగుతుంది.

నివారణ పద్ధతులు

మొక్కలు పూతకు రాకముందే చేతులకు తొడుగులు ధరించి పీకి వేసి తగులబెట్టాలి. జైగోగ్రామా, బైకొలరేటా పురుగులను ఉపయోగించి జీవనియంత్రణ ద్వారా ఈ మొక్కలను నిర్మూలించవచ్చు. ఆయా పంటలలో సంబంధిత కలుపు నాశినిలను ఉపయోగించి నివారించవచ్చని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సామూహిక నిర్మూలన చేపట్టాలి



వర్షాకాలంలో వయ్యారి భామ అధికంగా వచ్చే అవకాశం ఉంది. సామాజిక ఆరోగ్య భద్రత దృష్ట్యా పార్థీనియం వంటి సమస్యాత్మక కలుపు మొక్కలను సమర్థంగా నిర్మూలించడం అవసరం. కొబ్బరి తోటలు, ఇంతర పంటల్లో తెల్లదోమ, పిండినల్లి, తామర పురుగులను వయ్యారి భామ మొక్క ఎక్కువగా తయారు చేస్తుంది. ఈ మొక్క నుంచిగింజలు, పువ్వు తయారు కాకుండా ముందస్తుగా కత్తిరించడం వల్ల వయ్యారిభామను అరికట్టవచ్చు.

– వి.గోవర్ధనరావు, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త, అంబాజీపేట

కక్ష సాధింపు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- ఉచిత ఇసుక పేరుతో పెరిగిపోయిన టీడీపీ నాయకుల దోపిడీలు
- సంక్షేమ పథకాలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ధ్వజం



రావులపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: రైతుభరోసా, రైతులకు రబీ సీజన్ ధాన్యం డబ్బులు, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, ఉచిత సిలిండర్లు, మహిళలకు 1500, ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలు ఇవన్నీ ఎప్పుడు ఇస్తారో తేదీ, సమయం చెప్పి చేసే దమ్ము టీడీపీకి ఉందా అని, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలా సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ల జగ్గిరెడి అన్నారు. రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టిస్తాం అని గొప్పలు చెప్పిన జిత్తుల మారి చంద్రబాబు ఇప్పుడు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉందని మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎంటయులు తమ హయాంలో జరిగిపోతున్నట్టు ప్రచారాలు చేసుకోవడం, ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నాయకుల దోపిడీ దందాలు మితిమీరి పోతున్నాయన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని మరలా వారే ప్రతి తల్లికి అని మాట మారుస్తున్నారని, ప్రజల పక్షాన నిలబడి వైఎస్సార్ సీపీ ప్రశ్నించడంతో ఇప్పుడు మరలా మాట మార్చి ఇంకా విధివిధానాలు ఖరారు చేయలేదని, ప్రతి విద్యార్థికి అందిస్తామని రకరకాలుగా చెబుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రతిపక్షంగా తాము పోరాటం చేస్తామన్నారు. అలాగే రైతులకు రబీ సీసన్ ధాన్యం డబ్బులు నియోజకవర్గంలో రూ. 45 కోట్లు పైనే బకాయిలు ఉన్నాయని, 3 నెలలు గడిచినా వారికి డబ్బు వేయలేదని ఎన్నికల పేరుతో ఆపిన చెల్లింపులు ఈ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పైనే అయినా ఇంకా వేయకపోవడం బాధాకరమన్నారు. ఉచిత ఇసుక పేరుతో సీఎం చంద్రబాబు చెప్పేది ఒకటైతే, కొత్తపేట నియోజకవర్గంలో స్థానిక టీడీపీ నాయకుల తీరు దోపిడీకి పరాకాష్టగా ఉందన్నారు. మల్లయ్యదొడ్డి ఇసుక స్టాక్ రీచ్ వద్ద స్థానిక లారీలకు రూ.300, ఇతర ప్రాంతాల లారీలకు రూ.500 చొప్పున టీడీపీ వారు వసూలు చేస్తున్నారన్నారు. అలాగే పూరేటి వారి చెరువు వద్ద ఇసుక స్టాక్ పాయింట్ నుంచి అమరావతి, విశాఖ పట్నంలలో ప్రభుత్వ పనులకు ఇసుక పంపుతున్నామని చెప్పి స్థానిక వాహనాలను లోపలికి రానీయకుండా అడ్డుకుని, బయట వాహనాల వద్ద నుంచి మార్కెట్ లారీకు రూ.10 వేలు అనధికారికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ స్టాక్ పాయింట్‌లోకి స్థానిక వాహనాలు అనుమతించాలన్నారు. గత ప్రభుత్వంలో ఇసుకను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే అందించినా అప్పుడు చంద్రబాబు నాయుడు, ప్రస్తుత ఎమ్మెల్యే సత్యానందరావులు సెల్ఫీల పేరుతో అసత్య ప్రచారాలు చేశారన్నారు. ఇప్పుడు వారు వచ్చి ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద వసూలు చేస్తున్న డబ్బు పక్కన పెట్టుకుని సెల్ఫీ దిగాలని సవాల్ చేశారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే స్థానికులకు న్యాయం జరిగేలా మేమే స్టాక్ రీచ్‌లకు వెళ్లి జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ముందు వచ్చిన వాహనాలకు ముందు ఇసుక ఇచ్చేలా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొక్కా వెంకటలక్ష్మి, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కప్పల శ్రీధర్, కోనాల రాజు, తమ్మన శ్రీనివాస్, జవ్వాది రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

విపరీతంగా పెరిగిపోయిన గుర్రపు డెక్క



గుర్రపు డెక్కతో మూసుకు పోయిన కడలి చానల్

మామిడికుదురు: తాటిపాక ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని పంట కాలువల్లో విపరీతంగా పెరిగిపోయిన తూడు, గుర్రపు డెక్కతో సాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో ఖరీఫ్ సాగులో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఎంతో కాలం నుంచి గుర్రపు డెక్క, తూడు తొలగించమని డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా మానేపల్లి చానల్, కడలి చానళ్ల పరిస్థితి దారుణంగా ఉంది. కాలువల పరిస్థితిపై రైతులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. కాగా ఈ రెండు పంట కాలువల ఆధునీకరణకు నామమాత్రంగా రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. కడలి చానల్ పరిధిలో ఈదరాడ, గెద్దాడ, పొన్నమండ, కాట్రేనిపాడు తదితర గ్రామాలకు చెందిన ఆరు బ్రాంచ్ కాలువల పరిధిలో ఎనిమిది కిలోమీటర్ల మేర కాలువల్లో పెరిగిపోయిన తూడు, గుర్రపు డెక్క తొలగింపునకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. మానేపల్లి ఛానల్ పరిధిలో ఆరు బ్రాంచ్ కాలువలకు చెందిన 14 కిలోమీటర్ల మేర పంట కాలువల అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. నిధులు మంజూరయ్యాయి కానీ ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. దీనిపై తాటిపాక ఇరిగేషన్ ఏఈ సుందర్ సింగ్‌ను వివరణ కోరగా పనుల నిర్వహణకు టెండర్లు ఖరారయ్యాయని, రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు.

అల్లవరం పీరుకు హిందువుల పూజలు



మామిడికుదురులో అల్లవరం పీరుకు పూజలు చేస్తున్న హిందువులు

మామిడికుదురు: త్యాగాలకు ప్రతీకగా నిలిచే మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా అల్లవరం నుంచి వచ్చిన పీరుకు మంగళవారం హిందువులు మొక్కులు చెల్లించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. పీరును దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. ఏటా మొహర్రం సంతాప దినాల్లో అల్లవరం నుంచి పీరును తీసుకువచ్చి నగరం, మామిడికుదురు పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ. దానిలో భాగంగా అల్లవరం నుంచి తీసుకువచ్చిన పీరును తిరిగి తీసుకువెళ్లే క్రమంలో హిందువులు ఈ పీరును దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కాగా మొహర్రం సంతాప దినాల్లో భాగంగా నగరం గ్రామంలోని పలు పంజాల నుంచి పీర్లను తీసి ఊరేగించారు. కర్బలా యుద్ధంలో అసువులు బాసిన హజరత్ అబ్బాస్‌కు ఘనంగా నివాళులర్పించారు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించి రక్తం చిందించారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదు



రావులపాలెం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

రావులపాలెం: రాజ్యాంగం ప్రకారం ఉన్న మత స్వాతంత్ర్య హక్కును దుర్వినియోగం చేసేలా వివిధ మతాల వారు హిందువుల పట్ల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తిస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర పదాధికారి, గుంటూరు జిల్లా ఇన్చార్జ్ తమలంపూడి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఎంతో అభివృద్ధి చెంది భక్తులు లక్షలాది సంఖ్యలో స్వామిని దర్శించుకుంటున్నారన్నారు. అయితే ప్రతి శనివారం వెంకన్న దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రత్యేకంగా హిందూ భక్తులను మతం మార్చే విధంగా కొందరు క్రిస్టియన్ ప్లకార్డులు పట్టుకుని వాడపల్లి కెళ్లే మార్గంలో హిందూ భక్తులు ఇబ్బంది పడేలా ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచుతున్నారన్నారు. దీనిపై తాము రావులపాలెం సీఐకి ఫిర్యాదు చేయగా పోలీసులు కలగజేసుకుని అలా ప్లకార్డులు ప్రదర్శించే వారిని స్టేషన్‌కి తీసుకువెళ్లారన్నారు. అయితే ఇటీవల కాలంలో కొందరు గ్రూపులు గ్రూపులుగా ఏర్పడి రావులపాలెం నుంచి వాడపల్లి వరకూ పలు కూడళ్లలో క్రిస్టియన్ ఫ్లెక్సీలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ హిందూ భక్తులతో వాగ్వాదానికి దిగుతున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. అన్ని మతాలవారు మత సామరస్యాన్ని పాటించాలని వారి మతాచారాలను ఆచరిస్తూ ఇతర మతాలను గౌరవించాలన్నారు. అంతేకానీ ఈ విధంగా హిందువులు వెళ్లే మార్గంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ రెచ్చగొట్టే చర్యలు చేయడం హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసే చర్యల వల్ల శాంతి భద్రతల విఘాతం ఏర్పడుతుందని ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వూరు వెంకటకృష్ణారెడ్డి, మంచిగంటి కృష్ణ, ఈశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

ఆలమూరు: నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపును ఏర్పాటు చేసుకుని మద్యాన్ని విక్రయిస్తున్న దొంతంశెట్టి శివ లింగేశ్వరరావును ఆలమూరు ఎస్ఈబీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సీహెచ్ సత్యవేణి కథనం ప్రకారం మండపేట మండలంలోని గొల్లపుంతలో అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచి అధిక ధరకు విక్రయాలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో ఎస్ఈబీ పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నిందితుడు శివ లింగేశ్వరరావు వద్ద నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్‌హెచ్ఓ సత్యవేణి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలమూరు ఎస్ఈబీ పరిధిలో సారా తయారు చేసినా, విక్రయించినా, బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసిన చర్యలు తప్పవన్నారు. అలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సత్వరమే ఎస్ఈబీకి సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



మెస్సీకి ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ హెలీనా

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన విద్యార్థిని మెస్సీకి ఉయ్యూరి వారి మెరకకు చెందిన సేవా సంక్రాంతి సభ్యులు రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. మెస్సి ఇంటర్ పూర్తి చేసుకుని ఇంజినీరింగ్ కాలేజీలో చేరేందుకు అప్లికేషన్ తదితరాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నానని సహాయం చేయమని విశ్వేశ్వరాయపురం జెడ్పీ హైస్కూల్ హెడ్ మాస్టర్ చింతామణిని కలసి విన్నవించుకుంది. ఆయన వెంటనే సేవా సంక్రాంతి సభ్యులతో మాట్లాడి 5,000 సహాయాన్ని మంగళవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఒక సేవా కార్యక్రమంలో సేవా సంక్రాంతి గౌరవ సభ్యులు బోనం రాజు, పల్లపోతు జైదీప్‌ల సమక్షంలో గ్రామ సర్పంచ్ హెలీనా చేతుల మీదుగా మెస్సీకి అందజేశారు. కార్యక్రమంలో పలువురు పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా హెచ్‌పీ గ్యాస్ స్వర్ణోత్సవ మేళా

కొత్తపేట: హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీ) గ్యాస్ ఫౌండేషన్ స్వర్ణోత్సవాన్ని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌పీ గ్యాస్ సరఫరా ప్రారంభించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో మెగా డిస్కౌంట్ మేళా కార్యక్రమాన్ని మండలంలోని వానపల్లి పీఏసీఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్ బండారు వీరవెంకటసత్యనారాయణ (సతీష్) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వినియోగదారులు అతిథులుగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తమ ఏజెన్సీ ద్వారా కొత్తపేట, పి.గన్నవరం, అయినవిల్లి మండలాల్లో సుమారు 25 వేల మంది వినియోగదారులు ఉన్నారన్నారు. వినియోగదారులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా గ్యాస్ సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. కొత్త కనెక్షన్లు, స్టౌవ్‌లు, ట్యూబ్స్, లైటర్స్ ప్రత్యేక డిస్కౌంట్‌పై సరఫరా చేశారు. కార్యక్రమంలో బండారు వెంకటగౌరి, ఏజెన్సీ మేనేజర్ భమిడిపాటి ఆదిత్యభగవాన్, ఏఏఎం డి.మహదేవశర్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం



సహాయం అందజేస్తున్న బ్రైట్ స్టోన్స్ ప్రతినిధులు

మామిడికుదురు: మామిడికుదురు మండలం గెద్దాడకు చెందిన ఇజ్రాయిల్ బ్రైట్ స్టోన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు యువకులకు రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం నక్కిడిలంకకు చెందిన యల్లమిల్లి సత్యస్వరూప్ (17), సాత్విక్ (15) జన్యుపరమైన డీఎండీ కండరాల వ్యాధితో బాధపడుతున్నారు. వారికి ఏపీ ఎస్టీ కమిషన్ రిటైర్డ్ సెక్రటరీ, ఫ్యూచర్ ఫౌండేషన్ ప్రతినిధి సరెళ్ల సతీష్ చేతుల మీదుగా అందించారు. ఇజ్రాయిల్ బ్రైట్ స్టోన్ ప్రతినిధులు పల్లి రమణ రూ.10 వేలు, కర్రి సుజాత రూ.10 వేలు, గొల్ల సుధీర్ రూ.5 వేలు, బి.రాంబాబు రూ.5 వేలు, నల్లి నాగరాజు రూ.5 వేలు చుట్టుగుళ్ల శ్రీను రూ.5 వేలు వెరసి రూ.50 వేలు సహాయం అందించారు.

ఘనంగా సుబ్బాలమ్మ జాతర

అమలాపురం టౌన్: పట్టణ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన ఈ జాతరలో పండ్ల వర్తకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి



పెదపళ్ల పీహెచ్‌సీలో కుష్ఠు వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి సుమలత

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్‌ను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి మెండు సుమలత అన్నారు. మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారి పి.భవానీశంకర్ అధ్యక్షతన వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం ఉదయం నుంచి సాయంకాలం వరకూ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె పీహెచ్‌సీ పరిధిలో అందిస్తున్న సేవలు, ఆయుష్మాన్ భారత్ మందిరాల నిర్వహణ, టీకాల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. సుమలత మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటికే ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాలను గ్రామ స్థాయి ఆస్పత్రులుగా తీర్చిదిద్దే బాధ్యత ఎంఎల్‌హెచ్‌పీలు తీసుకోవాలన్నారు. అవసరమైన రోగులందరికి రక్త పరీక్షల నిర్వహించాలని, ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు యాప్‌లలో నిక్షిప్తం చేయాలంటూ ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన

గ్రామీణ ప్రాంతాల్లో అక్కడక్కడ కనిపిస్తున్న కుష్ఠు వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సుమలత అవగాహన సదస్సును నిర్వహించారు. శరీరంపై ఏ విధమైన మచ్చలు ఏర్పడిన సత్వరమే సమీప వైద్యాధికారికి తెలియజేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించేటప్పుడు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మందుల విభాగాన్ని టీకాల నిల్వలను పరిశీలించారు. చిన్నారులకు టీకాలు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించి ఏ విధమైన సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. వైద్యాధికారి డి.సాయికిషోర్, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఫార్మసిస్టు డి.సుగుణలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్.రాజారమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



బట్టేలంకలో స్టూడెంట్ కిట్లను అందిస్తున్న ఎంపీపీ సత్యవాణి, జెడ్పీటీసీ ప్రసన్నకుమారి



కేశవదాసుపాలెంలో పిల్లలకు స్టూడెంట్స్ కిట్లు ఇస్తున్న ఎంపీటీసీ సాయి కుమారి

మలికిపురం: విద్య కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మలికిపురం ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి పేర్కొన్నారు. మండలంలోని విశ్వేశ్వరాయపురం పాఠశాలలో ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్ కిట్లను ఇరువురూ పంపిణీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ చక్కగా విద్యాభ్యాసం చేసి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బట్టేలంక తదితర గ్రామాల్లో కూడా కిట్ల పంపిణీ జరిగింది.

కేశవదాసుపాలెంలో..

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను అందజేశారు. ఎంపీటీసీ ఉండపల్లి సాయి కుమారి, స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ ముసునూరి రామారావు, హెచ్ఎం రజనీకుమారి, ఉండపల్లి అంజి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యను ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న వైద్యాధికారులు

రాజోలు: నిరుపేద విద్యార్థులు ఆర్థిక సమస్యలతో విద్యను నిలిపివేయకుండా ప్రోత్సాహం అందిస్తున్న సేవ్ ది పీపుల్ సంస్థ సేవలు అభినందనీయమని తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికుమార్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో పొదలాడ గ్రామానికి చెందిన జి.మేఘనకు రూ.10 వేల చెక్‌ను వైద్యులు ఫణికుమార్, మానస సుప్రియ అందజేశారు. వారు మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు సుంకర సుధీర్ సేవలను కొనియాడారు. తెలివైన విద్యార్థులు కేవలం ఆర్థిక సమస్యలతో ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అటువంటి వారిని గుర్తించి ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులను అభినందించారు. సీహెచ్ఓ ఎం.ఎలిజబెత్, పీహెచ్ఎస్ ఎ.సత్యవతి, హెచ్‌వీ బి.జయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాసరావు, ఫార్మసిస్ట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి రూ.10 వేల అందజేత



బాధితుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.10 వేల నగదును మంగళవారం సాయంగా అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన కరిబండి ఫణిసుధీర్ (23) డ్రైవర్ గా పని చేస్తున్నాడు. కొన్ని రోజులు క్రితం కామెర్లు బారిన పడి రాజమహేంద్రవరం హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ తీసుకుంటున్నాడు. ప్రాణాపాయ స్థితికి చేరుకొని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. ట్రీట్మెంట్‌కి 6 నుంచి 7 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. అంత స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరడంతో రావులపాలెంలో ఫణి సుధీర్ తండ్రి శ్రీనుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.